కవితా కౌముది

# నేనో కల కనాలి

పులగం చిన్నారాయణ

రాత్రి వచ్చిన ప్రతి కలనీ భద్రపరచుకుంటుంటాను.
మనసు నిండా అరలు నింపేసుకుని
ఆ అరల నిండా కలలు వంపేసుకుని ఒకటే హడావిడి నాది.

ఒక్కో అరలో  ఒక్కో కల.
ఎప్పుడో చటుక్కున
ఓ కల గుర్తుకొస్తుంది.
టక్ మని ఆ అరను తెరచి
కాసేపలా కలను తడిమి
మళ్లీ షరా మామూలే.

కొన్ని కలలు వడిలి పోతుంటాయి.
మరికొన్ని రెట్టింపు  బరువెక్కి
అర సరిపోనంతగా పెరిగిపోతుంటాయి.
ఇంకొన్ని కలలు
ఏవేవో కలవరానికి
గురవుతుంటాయి.
వాటికి జోడీ  కోసం
మళ్లీ కొత్తగా
నేనో కల కనాల్సి వస్తుంది.
అప్పుడా రెండు కలలూ కలగలసిపోయి
తెగ హుషారైపోతాయి.
ఇది నా నిరంతర ప్రక్రియ.

కలకు కాల పరిమితి ఉంటుందా?
ఏమో నాకైతే అస్సలు తెలీదు.
ఈ మధ్య మొత్తం అరల నిండా
కలలు నిండిపోయాయి.
ఒక్క అరా ఖాళీ లేదు.
ఇప్పుడేం చేయాలి ?
అయితే కలలు కనడం మానేయాలి.
లేకుంటే
ఈ కలలన్నిటినీ గిరాటు వేసేసి
కొత్త కలలు కనడం మొదలుపెట్టాలి.
ఏ నిర్ణయమూ
రాత్రి కలలో నిర్ధారించుకోవాలి.

★★★

# ఇది కూడా తెలియాలి

అనూరాధ బండి

ఎక్కడి గాలి
ఇంకెక్కడి నీరు
అంతా నిప్పే

వీచి వీచి
ఒక్కోసారి నిశ్శబ్దాన్ని
హత్తుకొని

పారి పారి
ఎక్కడో ఓచోట
నిశ్చలంగా కుదురుకొని

రగిలి రగిలి
మండుతూ మాడుతూ
బూడిద కుప్పేగా ఓచోట

అయ్యో అని ఓ పిలుపు
అమ్మో అని ఓ అరుపు
అబ్బా అని ఓ ఆర్తనాదం

గాలిపోసుకోక పోసుకోలేక
దాహమయ్యీ దాసోహంకాలేక
దహించుకుంటూ దహించుకుపోయి

క్షణాలన్నీ ఇక పుట్టినట్టూ
మరిక పుట్టి మరణించినట్టూ
గాలిపోసుకున్నట్టూ ఉరేసుకున్నట్టూ

తెలిసి చెప్పగలవారెవ్వరూ
తెలియక మథనపడువారెందరూ
తెలిసితెలియని మేళమేదో ఎక్కడో..

ఆత్మవస్త్రము ధరియించీ
రెక్కలు విడిచీ
రెప్పలతో మనసు కళ్ళుమూసి..

..పయనించగనప్పుడు
అప్పుడు ; అప్పుడా..
నువ్వెవరో నేనెవరో మనమెవరో..
....
ఒక గాలి
ఒక నీరు
ఒక నిప్పు లా...
రహస్యం బయల్పడేది....!!

★★★

# మేలుకోవే మగువ మనసా

విశ్వనాథ్ కౌశిక్

ముద్దబంతి పువ్వువని, మందార అరవిందమని,
కనులు కలువ రేకలని, నాసిక సంపెంగయని,
చెక్కిళ్లు రోజాలని, చుబుకం చిరు మొగ్గని,
జాజులన్ని విరిసినట్టి తీగయె నీ నడుమని,
విరులకున్న అందాలను నీ మేనుకు మేళవించి,
పొగడి పొగడి బులిపించి, మనసును మైమరపించి,
పోతు తేనెటీగ వోలె, మరి పరువాలను కొల్లగొట్టి,
పూలవోలె నీబ్రతుకున, వెలుగులు తృటి కాలమని,
మనిషి మాటు మృగపు మాట, మేలుకోవె మగువ మనసా!

విత్తువె మొలకెత్తునపుడు పురుగుల బెడదను  బడును,
ఆకులు చిగురేయునపుడు, పిట్టల పొడుపెక్కువౌను,
మొక్కై తానెదుగు నపుడు మింగ చూచు పశువులపుడు,
వృక్షమై విస్తరించ ఆశ్రయమే తానన్నిటికి
పిండముగా నుండగ నీ పీక నొక్కు ప్రణాళికలు,
పసిపాపై ఎదుగుతుంటె, అపహ రణాలోచనలు,
వయసొచ్చిన నాటి నుండి కామపు దోషపు చూపులు
అన్నింటిని తట్టుకొని , నెట్టుకొని, దిట్టమైన చెట్టు వోలె,
తల్లివి, చెల్లివి, ఇల్లాలివీ నీవైనయంత,
నీ తోడులోనే బ్రతుకంతా గడిపే యీ జగమంతా,
చెప్పరు ఈ నిజమెవరూ, మేలుకోవె మగువ మనసా॥

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

సహనమెప్పుడు జీవితాశయము మనకు
శాంతమే మన హృదయస్థ సహజగుణము
క్షమకు చిరనివాసము మన స్వాంతమెపుడు
కోపమెరుగని నైర్మల్యగుణము మనది

పోరెరుంగని సాత్వికబుద్ధి మనది
సర్వజనులొక్కటనెడు నైజమ్ము మనది
మార్గభిన్నత్వమెరుగము మచ్చుకైన
సకలమార్గములు మనకు సమ్మతమ్ము

అద్భుతమ్మైన క్షమ మన యాత్మపథము
ఎవ్వరీసడించినను మన్నింపగలము
ఎవరి త్రోవలననము పల్లెత్తు మాట
గౌరవింతుమందరి నమ్మకముల మనము

ఎంత మహనీయమైన ప్రవృత్తి యైన
కొలది మార్లైన యాత్మ మేల్కొనగవలదె?
అన్యులెవ్వరో మన బుద్ధినపహసింప
సహ్యమే యెల్లలెరుగని శాంతగుణము?

ఎవరో మనపైన కత్తులనెత్తునపుడు
హృదయవిశ్వాసములను ఛేదించునపుడు
అమితసహనమ్ము నిష్ఫలమ్మైన యపుడు
క్షమను వర్జించుటే సర్వసమ్మతమ్ము

COMMENTS